ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
7
ఆదివారం 19 అక్టోబరు 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 23.0

గుడ్లు తేలేశారు..!

నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల మెనూలో మార్పులు

కోడి గుడ్లు బంద్.. వారానికి ఒకసారే మాంసాహారం





- మెస్‌ల నిర్వహణ హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగింత
- విద్యార్థులకు వీరు పెట్టేది వెజిటేరియన్ భోజనం మాత్రమే
- మాంసాహారం కాంట్రాక్టు వేరొకరికి అప్పగింతపై నిర్ణయం తీసుకోని ఆర్జీయూకేటీ
- పెరిగిన ఖర్చు.. నిర్వహణ భారం

నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనంలో వారానికి ఐదు సార్లు కోడిగుడ్లు, రెండు రోజులు మాంసాహారాన్ని అందించాలి. కాని, మెస్ నిర్వాహకుల మార్పుతో కొన్ని రోజులుగా గుడ్లు అందించడం లేదు. మాంసాహారాన్ని ఒక రోజుకే కుదించారు. దీనిపై విద్యార్థుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

(నూజివీడు టౌన్-ఆంధ్రజ్యోతి)

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో మెస్‌లను అక్షయ పాత్ర అనుబంధ హరేకృష్ణ ఫౌండేషన్‌కు ఇటీవల అప్పగించారు. దసరా సెలవుల తరగతులు పునః ప్రారంభం కాగానే మెస్‌ల బాధ్యతను ఈ ఫౌండేషన్ స్వీకరించింది. వీరు కేవలం శాఖాహారాన్ని మాత్ర మే అందిస్తారు. మెనూ ప్రకారం ఇవ్వాల్సిన కోడిగుడ్లు, మాంసాహారం అందించే బాధ్యతను వేరొక సంస్థకు అప్పగించాలి. అయితే ఇది ఎవరికి, ఎలా ఇవ్వాలో తెలియక ఆర్జీయూకేటీ ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. సెలవులు అనంతరం విద్యార్థులకు కోడి గుడ్లు ఇవ్వడం పూర్తిగా బంద్ అయింది. గత ఆదివారం మాంసాహారం ప్రయో గాత్మకంగా ఏర్పాట్లు చేసినా అందరికీ పూర్తిగా అందలేదు.

ఎనిమిది వేల మంది విద్యార్థులు

నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన ఆరు వేల మందితోపాటు శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌ల పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 2,200 మందికి ఇక్కడి హాస్టల్‌లోనే వుంటున్నారు. మొత్తం ఎనిమిది వేల మందికి 80-20 శాతం లెక్కన మాంసాహారం, శాఖాహారాలను విభజించి గతంలో 750 కేజీలు కోడి మాంసం, మిగిలిన వారికి పన్నీరుతో ఆహారాన్ని అందించేవారు. విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పడిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థను నిర్వహించే కొందరు అధ్యాపకులు తాత్కాలికంగా మాంసాహారం అందించే బాధ్యతను చేపట్టారు. గత ఆదివారం కేవలం 550 కేజీల కోడి మాంసం తీసుకుని వస్తే అది సరిపోలేదు.

పెరిగిన ఆర్థికభారం.. అయోమయం

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో నూజివీడు, ఆర్కేవ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో దాదాపు 25 వేల మంది విద్యార్థులు ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి వసతి సౌకర్యాలను అందించేందుకు గతంలో ప్రత్యేకంగా మెస్ క్యాటరర్స్ ఉండేవారు. వీరికి ఒక్కో విద్యార్థికి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనంతో కలిపి రూ.88 చెల్లించేవారు. ప్రస్తుతం సదరు మెస్ నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం అక్షయపాత్ర అనుబంధ సంస్థ హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగిస్తూ ఒక్కో విద్యార్థికి భోజనం అందించేందుకు రూ.110 చెల్లించేందుకు నిర్ణయం తీసుకుంది. దీంతోపాటు కోడిగుడ్డు, మాంసాహారం అందించేందుకు ఒక్కో విద్యార్థికి రూ.6.70 పైసలు అదనంగా చెల్లించేందుకు నిర్ణయించినా సదరు బాధ్యతలను ఎవరికి అప్పగించాలనే నిర్ణయం తీసుకోలేదు.

మాంసాహారం కాంట్రాక్ట్‌పై నేతల చూపు

విద్యార్థులకు మాంసాహారం అందించే కాంట్రాక్ట్‌ను మెప్మాకు లేదా విద్యార్థులకు సహాయ సహకారాలు అందించే హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు అందించాలని ఆర్జీయూకేటీ ఉన్నతాధికారుల ఆలోచన. అయితే వీరిద్దరిలో ఎవరికి ఇచ్చినా తిరిగి బయట వారికి కాంట్రాక్ట్ ఇవ్వాల్సిందే. ఇప్పటికే ట్రిపుల్ ఐటీలోని ఫుడ్‌కోర్టును మెప్మాకు ఇవ్వగా 0.5 శాతం లాభానికి బయట వ్యక్తులకు ఫుడ్ కోర్టును కాంట్రాక్ట్‌కు మెప్మా ఇచ్చింది. మరోవైపు మాంసాహారం కాంట్రాక్ట్‌పైనా కొందరు అధికార పార్టీ నాయకుల చూపు పడింది. విధాన నిర్ణయం తర్వాత దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం.

తీపి కబురు

- వసూలు చేసిన విద్యుత్ ట్రూ అప్ చార్జీలు ట్రూ డౌన్‌గా మినహాయింపు ..
- నవంబరు బిల్లుల నుంచి అమలు.. యూనిట్‌కు 13 పైసలు తగ్గింపు
- ఎల్‌టీ వినియోగదారులకు రూ.1.33 కోట్లు, హెచ్‌టీ వినియోగదారులకు రూ. 42.48 లక్షలు తగ్గనున్న నెల భారం



ఏలూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత ప్రభుత్వ హయాంలో ట్రూ అప్ పేరిట ఎప్పుడో వినియోగించిన విద్యుత్ వాడకానికి సంబంధించి వినియోగదారుల నుంచి ఎడాపెడా అదనంగా విద్యుత్ చార్జీలు వసూలు చేసేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చి చార్జీలు తగ్గేలా చేస్తామని హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగానే 2025 నవంబరు నుంచి ట్రూ డౌన్ పేరుతో విద్యుత్ చార్జీలను తగ్గించనున్నారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు వినియోగదారులు వాడకా నికి సంబంధించి ఒక్కో నెలలో ట్రూ డౌన్ పేరిట యూనిట్‌కు 13 పైసలు వరకు తగ్గిం చాలని నిర్ణయించారు. ట్రూ అప్ చార్జీలు తగ్గడంతో పాటు గతంలో వినియోగించిన విద్యుత్ వాడకానికి సంబంధించి అడ్జస్టమెంట్ చేయడంతో కొంతవరకు బిల్లులు తగ్గనున్నాయి.

తగ్గనున్న భారం

ఏలూరు జిల్లాలో 2024 ఏప్రిల్ విద్యుత్ బిల్లుల వాడకానికి సంబంధించి పరిశీలిస్తే మొత్తం ఎల్‌టీ విద్యుత్ వినియోగదారులు 10 కోట్ల 19 లక్షల 75 వేల 30 యూనిట్లు వినియోగించగా దానికి సంబంధించి కోటి 33 లక్షల 79 వేల 123 రూపాయల భారం ట్రౌడౌన్ చార్జీలుగా తగ్గనుంది. జిల్లాలో హెచ్‌టీ వినియోగదారులు 3 కోట్ల 23లక్షల 78వేల 460 యూనిట్లు వినియోగించగా దానికి సంబంధించి 42 లక్షల 48వేల 58 రూపాయలు ట్రూడౌన్ చార్జీల మినహాయింపుగా తగ్గనుంది.

విద్యుత్ వినియోగదారులకు ఊరట

ఇప్పటి వరకు ట్రూ అప్ చార్జీలుగా గతంలో వినియోగించిన విద్యుత్ వాడకానికి సంబంధించి ఎఫ్‌పీపీసీఏ అడ్జస్టమెంట్ కింద అదనంగా చార్జీలు విద్యుత్ బిల్లుల్లో వసూలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇక నుంచి ట్రూ డౌన్ చార్జీల పేరిట ఎఫ్‌పీపీసీఏ అడ్జస్టమెంట్‌లో ఏప్రిల్ 2024 నుంచి 2025 మార్చి వరకు విద్యుత్ వినియోగానికి సంబంధించి 2025 నవంబరు నుంచి 2026 అక్టోబరు వరకు విద్యుత్ బిల్లులలో ట్రూ డౌన్ చార్జీలు పేరిట యూనిట్‌కు 13 పైసలు భారం తగ్గుతుంది. రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయటంతో పాటు విద్యుత్ వినియోగదారులకు ఊరట కలిగించేలా ట్రూ డౌన్ అడ్జస్టమెంట్‌లో భాగంగా విద్యుత్ బిల్లులలో చార్జీలు కొంత మేరకు తగ్గనున్నాయి. దీని వల్ల రాబోయే నవంబరు నెల నుంచి కొంత మేరకు విద్యుత్ చార్జీలు తగ్గనున్నాయి.

- పి.సాల్మన్‌రాజు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ

ట్రూ డౌన్ పేరిట విద్యుత్ బిల్లులలో చార్జీలు తగ్గింపు ఇలా..

ట్రూ డౌన్ ఆఫ్ ఎఫ్‌పీపీసీఏ విద్యుత్ వాడకం నెల	బిల్లులలో 13 పైసలు తగ్గించే నెల
ఏప్రిల్ 2024	నవంబరు 2025
మే 2024	డిసెంబరు 2025
జూన్ 2024	జనవరి 2026
జూలై 2024	ఫిబ్రవరి 2026
ఆగస్టు 2024	మార్చి 2026
సెప్టెంబరు 2024	ఏప్రిల్ 2026
అక్టోబరు 2024	మే 2026
నవంబరు 2024	జూన్ 2026
డిసెంబరు 2024	జూలై 2026
జనవరి 2025	ఆగస్టు 2026
ఫిబ్రవరి 2025	సెప్టెంబరు 2026
మార్చి 2025	అక్టోబరు 2026



ముగిసిన బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవం

ఆత్రేయపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు తనయుడు సంజీవ్ దంపతులు మహా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గౌతమి గోదావరి తీరాన చక్రస్నాన మహోత్సవంలో ఎమ్మెల్యే బండారు, చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు దంపతులతో పాటు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ధ్వజావహరోణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగించారు.

నిబంధనలు బేఖాతర్!

- అనుమతులు తక్కువ.. నిల్వలు ఎక్కువ
- ఉమ్మడి పశ్చిమ జిల్లాలో బాణసంచా వ్యాపారుల నిర్వాకం

■ లోపలి పేజీలో..

అందరి కృషితోనే 'పీఎం జన్‌మన్ ఉత్తమ అవార్డు'

- కేఆర్‌పురం ఐటీడీఏ పీవో రాములు




బుట్టాయగూడెం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్, కేఆర్ పురం ఐటీడీఏ చైర్మన్ కె.వెట్రిసెల్వి మార్గదర్శకంలో అధికారులంతా సమన్వయంతో పనిచేయడం వలనే కేఆర్‌పురం ఐటీడీఏకు ప్రధానమంత్రి జన్‌మన్ ఆదికర్మయోగి అభియాన్ కింద రాష్ట్రస్థాయిలో 'ఉత్తమ ఐటీడీఏ'గా అవార్డు దక్కించుకుందని ప్రాజెక్టు ఆఫీసర్ కె.రాములు నాయక్ అన్నారు. ప్రధాన మంత్రి ఆదికర్మయోగి అభియాన్ పథకంలో ఉత్తమ పనితీరు కనబరచిన రాష్ట్రాలు, జిల్లాలు, ఐటీడీఏలు, మండలాలు, గ్రామస్థాయి అధికారులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం అవార్డులు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఆదికర్మయోగి అభియాన్ జాతీయ సదస్సులో రాష్ట్రానికి మూడు అవార్డులు దక్కగా అందులో ఏలూరు జిల్లా కేఆర్‌పురం ఐటీడీఏకు ఉత్తమ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఢిల్లీలో ఉన్న పీవో శనివారం 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. అవార్డు రావడం సంతోషంగా ఉందని పథకం విజయవంతానికి పట్టుదలతో మరింతగా కృషి చేస్తామన్నారు. డివిజన్, ఐటీడీఏ, మండల అధికారులు, ట్రైనర్స్‌తో పాటు గ్రామస్థాయిలో పనిచేసిన ఉద్యోగుల కృషి మరువలేనిదని పీవో తెలిపారు. పీఎం ఆదికర్మయోగి అభియాన్ పథకాన్ని అమలు చేయడంలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలో తొమ్మిది మండలాల్లోని 46 గిరిజన గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టాయి. దీనిలో భాగంగా గ్రామాల్లో గ్రామసభలు పెట్టి ప్రజల సమక్షంలోనే క్షేత్రస్థాయిలోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు అవసరమైన నిధుల కోసం అధికారులు ప్రణాళికలను సిద్ధం చేయడంలో ఐటీడీఏ కనబరచిన ప్రతిభకు అవార్డు దక్కినట్టు అయ్యింది.

బీపీఎస్..భలే ఛాన్స్

- గెజిట్ నోటిఫికేషన్ విడుదల..
- అక్రమ కట్టడాలు, అదనపు అంతస్తుల క్రమబద్ధీకరణ
- మునిసిపాలిటీలకు సమకూరనున్న ఆదాయం
- త్వరలో కార్యాచరణ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)



కార్పొరేషన్, మునిసిపాలిటీల్లో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా చేపట్టిన భవన నిర్మాణాలు, అదనపు అంతస్తులను క్రమబద్ధీకరించుకునేందుకు ఉద్దేశించిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్) అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించడంతో ప్రభుత్వం శుక్రవారమే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. చాలాకాలం తర్వాత బీపీఎస్‌కు గంపగుత్తగా ఎక్కువ సంవత్సరాల కాల పరిధిలో అమలు చేయడానికి అవకాశం కల్పించడంతో భవన యజమానులు, ప్లాట్ ఓనర్లకు ఊరటనిచ్చే అంశం. మరోవైపు స్థానిక మునిసిపాలిటీలకు ఆదాయం దండిగానే సమకూరనుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన తొలి అవకాశం ఇదే కావడంతో భవన యజమాను లు తమ భవనాలను క్రమబద్ధీకరించుకునే సువర్ణ అవకాశంగా అధికారులు చెబుతున్నారు.

దగ్గరి తేదీతో జీవో.. పెద్ద సంఖ్యలో భవనాలకు బెనిఫిట్

రాష్ట్రంలో 2025 ఆగస్టు 31 నాటికి ముందు అనుమతులు తీసుకోకుండా చేపట్టిన 59,041 నిర్మాణాలు, 9,985 అదనపు అంతస్తులు అనుమతులు తీసుకుని, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన మరో 49,056 నిర్మాణాలు క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గతం లో బీపీఎస్‌కు తక్కువ కాల పరిమితిలో నిర్మిం చిన కట్టడాలను పరిగణనలోకి తీసుకోవడం వల్ల ప్రయోజనం పెద్దగా ఉండేది కాదు. ఈసారి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తూ ఇటీవల నిర్మాణా లను చేసుకున్న వాటికి కూడా బీపీఎస్ అమలు చేయడంతో గండి పడిన ఆదాయంలో కొంత భాగమైనా స్థానిక సంస్థలకు దక్కే అవకాశం ఉంది. ఏలూరు కార్పొరేషన్, జంగా రెడ్డిగూడెం, నూజి వీడు మునిసిపాలిటీలు, చింతలపూడి నగర పంచాయతీల్లో కొత్తగా దరఖాస్తు లను ఆహ్వానిం చనున్నారు. గతంలో నమోదు చేసుకుని ఫీజులు కట్టి, క్రమబద్ధీకరిం చేందుకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు అపరాధ రుసుం కట్టించుకుని వాటిని పరిష్కరిం చనున్నారు. టౌన్ ప్లానింగ్‌లో బీపీఎస్ మేళాలను నిర్వహించి భవన, ప్లాట్ యజమానులకు త్వరలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించే యోచనలో ఉన్నారు. ఈ మేరకు మార్గదర్శకాలు విడుదలవుతాయని అధికారులు చెబుతున్నారు.

నూజివీడులో జూదాలను అరికట్టాలి : మంత్రి పార్థసారథి



నూజివీడు, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): 'నూజివీడు నియోజకవర్గంలో జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన నియంత్రించండి. అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహించినా, ఫిర్యాదులు వచ్చినప్పుడు అలసత్వం వహించినా మీపై చర్యలు తప్పవు' అంటూ నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి పోలీస్ అధికారులను హెచ్చరించారు. శనివారం వర్చువల్ సమావేశంలో పోలీస్ అధికారులతో ఆయన ఈ అంశాన్ని సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. 'జూదాల వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయి. యువత వ్యసనాలకు బానిసలవుతున్నారు. నియోజకవర్గ పరిధిలో పలు గ్రామాలు పేకాట, కోడిపందేలకు అడ్డాగా ఉన్నాయని నా దృష్టికి వచ్చింది. కొందరు అధికారులు ఈ జూదాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ నాయకులు సిఫార్సులు చేసినా ప్రలోభాలు పెట్టినా లొంగకుండా విధి నిర్వహణలో నిబంధనలు పాటిస్తూ నూజివీడు పోలీస్ అధికారులు కఠినచర్యలు తీసుకోండి' అంటూ సూచించారు.



ఇళ్లను కమ్మేసిన తుప్పలు

నిరుపయోగం!

- నిర్వాసిత కాలనీల్లో ఇళ్లు కన్పించకుండా కమ్మేసిన తుప్పలు

జీలుగుమిల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నిర్వాసిత కాలనీలు నిరుపయోగంగా మారాయి. వేలేరుపాడు మండలం నార్లవరం నిర్వాసిత కాలనీని దర్భగూడెం పంచాయతీ చీమలవారిగూడె వద్ద నిర్మించారు. గత ఐదేళ్లుగా కాలనీ వాసులు తమ సొంత గ్రామాల్ని వదిలి ఇక్కడ నివసించేందుకు తరలి రావడం లేదు. నివాసాల వద్ద పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు లేకపోవడం, మరికొందరు ఉన్న ఊర్లో వ్యవసాయం చేస్తూ మన్యం జీవనానికి అలవాటు పడినట్టు చెబుతున్నారు. దీంతో నిర్వాసితులకు ఇక్కడ నిర్మించిన ఇళ్ల విష సర్పాలకు (మిగతా 8వ పేజీలో)



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య

సమస్యలు పరిష్కరించండి

- సహకార ఉద్యోగుల యూనియన్ డిమాండ్
- 27న ఆప్కాబ్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా

ద్వారకాతిరుమల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, జీవో 36ను వెంటనే అమలు చేసి తమకు న్యాయం చేయాలని వ్యవసాయ కోఆపరేటివ్ సొసైటీ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకట్రామయ్య కోరారు. ప్రాథమిక సహకార సంఘాల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా కార్యవర్గ సమావేశం ద్వారకా తిరుమలలో శనివారం జరిగింది. వెంకట్రామయ్య మాట్లాడుతూ ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడి హక్కుల సాధించుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు, ప్రభుత్వ అధికారులు అవలంబిస్తున్న తీరుపై చర్చించారు. ఈనెల 27న ఆప్కాబ్ ప్రధాన కార్యాలయం వద్ద ఉద్యోగుల సమస్యలపై నిరసన ధర్నా చేపట్టాలని నిర్ణయించారు. సంఘనేతలు సుబ్బారావు, వీరయ్య, ఆర్.లింగరాజు, డి.ప్రసాద్, స్థానిక సొసైటీ సీఈవో నల్లూరి శ్రీకిశోర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే భావితరాల ఆరోగ్యం

- కలెక్టర్ వెట్రిసెల్వి

పెదవేగి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):పర్యావరణ పరిరక్షణతోనే భావితరాల ఆరోగ్యకరమైన జీవనం సాధ్యపడుతుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పెదవేగి మండలం నడిపల్లిలో పర్యటించిన కలెక్టర్ పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా క్లీన్ ఎయిర్ (స్వచ్ఛ గాలి) థీమ్‌తో జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. మొక్కలు నాటితే సరిపోదు.. వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలి' అంటూ ఆమె పిలుపునిచ్చారు.

లబ్ధిదారులు గృహ ప్రవేశాలకు సిద్ధంకండి..

మన ఇల్లు- మన గౌరవంతో పేదలకు సొంతిల్లు కల నెరవేరుతుందని, ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి, గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని లబ్ధిదారులకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. నడిపల్లి కొత్తూరు కాలనీలో శనివారం పర్యటించిన కలెక్టర్ వివిధ దశల్లో ఉన్న గృహాలను



మొక్కను నాటుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామంలో 169 ఇళ్లకు 79 మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన 90 ఇళ్ల నిర్మాణాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో గృహ నిర్మాణ శాఖ పీడీ జి.సత్యనారాయణ, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ జి.త్రినాథబాబు, డీపీవో కె.అనురాధ, తహసీల్దారు ఎస్వీ.భ్రమరాంబ, తహసీల్దారు కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధన త్రయోదశి సందడి..

ఏలూరు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి అమావాస్యకు రెండు రోజులు ముందు వచ్చే త్రయోదశిని ధన త్రయోదశిగా చెబు తుంటారు. దీనినే ధన్ తేరాస్ అంటారు. ధన త్రయోదశి వంటి మంచిరోజుల్లో పసిడి కొనుగోలు చేయడాన్ని శుభప్రదంగా భావిస్తారు. ఆ రోజు బంగారం కొనుగోలు చేసి లక్ష్మీదేవికి పూజలు చేస్తే సిరి సంపదలు సిద్ధిస్తాయని విశ్వాసం. ధన త్రయోదశిని పురస్కరించుకుని జిల్లాలోని ఏలూరుతో పాటు మిగిలిన పట్టణాల్లో బంగారు ఆభరణ దుకాణాల వ్యాపారస్తులు ఆఫర్లతో అదరగొడుతున్నారు. శనివారం ఏలూరులోని బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి.



ఏలూరులోని ఓ జ్యూయలరీ షాపులో కొనుగోలుదారుల రద్దీ

బంగారం ధర ఆకాశాన్ని అంటుతున్న వెనక్కి తగ్గడం లేదు. డిమాండ్‌కు దృష్టిలో పెట్టుకుని వివిధ రకాల డిజైన్లను వర్తకులు అందుబాటులోకి తెచ్చారు.

జేఎన్వీలో 9,11 తరగతుల ఖాళీల భర్తీకి గడువు పెంపు

■ లోపలి పేజీలో..

ఆర్థిక అక్షరాస్యతపై భోగాపురంలో అవగాహన

పెదవేగి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భోగాపురం గ్రామానికి చెందిన పెద్దిబోయిన లక్ష్మికి పీఎంజేజేబీవై పథకంలో రూ.2 లక్షలు లబ్ధి చేకూరింది. పెద్దిబోయిన లక్ష్మి గ్రామంలో ఏర్పాటు చేసిన ఎస్‌ఎస్‌టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో గ్రామస్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా బ్యాంకింగ్ పథకాలు, డిజిటల్ బ్యాంకింగ్, ప్రైవేట్ ఆర్థిక సంస్థల మోసాలు, ఆన్లైన్ బ్యాంకింగ్ మోసాలు, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, రిజర్వ్ బ్యాంక్ అంబుడ్స్‌మన్‌పై అవగాహన కల్పించారు.

● నగరంలో దీపావళి సందడి



ఏలూరు రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలో దీపావళి సందడి నెలకొంది.. సోమవారం పండుగను పురస్కరించుకుని ఏలూరు ఇండోర్ స్టేడియంలో బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. 48 షాపులు ఏర్పాటుకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. అయితే మందుగుండు సామగ్రి ధరలు మండిపోవడంతో మితంగా మందులు కొనుగోలు చేస్తున్నారు.

కాంట్రాక్టర్ల బకాయి బిల్లులు చెల్లించండి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న రూ.600 కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి తమను ఆదుకోవాలని మున్సిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ వేములపల్లి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రెండున్నర ఏళ్లుగా రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, 17మున్సిపల్ కార్పొరేషన్లలో వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులను బంగారం, ఇళ్ల తాకట్లు పెట్టి, బ్యాంకుల్లో అప్పులు తెచ్చి పనులు చేశామని, ఆ బిల్లులు రాకపోవడంతో రోడ్డున పడ్డామని శ్రీనివాసరావు వాపోయారు. ఏలూరు జిల్లాలో సుమారు రూ.80 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం మున్సిపల్ జనరల్ ఫండ్స్‌పై ఆర్థిక శాఖ నూతనంగా ప్రవేశ పెట్టిన కఠిన నియంత్రణ వల్ల బిల్లులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టర్లు కొత్త పనులు చేయలేక, పాత బిల్లులు రాక తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. ఆర్థిక శాఖ విధించిన కఠినమైన నిర్ణయాలను సడలించి తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం : డీఎంహెచ్‌వో

పెదపాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం, చేయడం నేరమని, అటువంటి చర్యలకు పాల్పడితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో పీజే అమృతం హెచ్చరించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో బాలింతలు, కిశోర బాలికలకు శనివారం అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌వో అమృతం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్య సంరక్షణ పట్ల పూర్తిస్థాయి బాధ్యతతో మెలగడంతో పాటుగా వైద్య సిబ్బంది సలహా, సూచనలు పాటించాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిసరాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటారు. డాక్టరు అనంత్‌పాల్, వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, రాము పాల్గొన్నారు.

చెరువు లీజు వివాదంపై అధికారుల విచారణ



మహిళలతో మాట్లాడుతున్న అధికారులు

భీమడోలు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భీమడోలు మండలం చెట్టున్నపాడు గ్రామంలో చేపల చెరువు లీజు అంశంపై నెలకొన్న వివాదంపై డీఎస్పీ శ్రావణ్ కుమార్, ఆర్డీవో అంబరీష్‌లు విచారణ నిర్వహించారు. మూడేళ్లుగా గ్రామంలో ఓ సొసైటీకి చెందిన చేపల చెరువుకు సంబంధించి వివాదం నడుస్తోంది. లీజు విషయమై గ్రామంలో ప్రజలు కొన్ని వర్గాలుగా మారి తమ వారికే ఇవ్వాలంటూ పట్టుబడుతున్న నేపథ్యంలో గ్రామంలోని కొందరు వ్యక్తులు తరచు ఏలూరులో పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు చేస్తుండడంతో శనివారం అధికారులు గ్రామంలో పర్యటించారు. లీజు ఎవరికివ్వాలనే అంశాన్ని లిఖిత పూర్వకంగా తెలపాలని గ్రామస్థులకు సూచించారు. ఉన్నతాధికారుల సూచనలతో మెజార్టీ ప్రజల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. భీమడోలు సీఐ విల్సన్, తహసీల్దార్ రమాదేవి పాల్గొన్నారు.

క్లౌడ్ సాంకేతిక నైపుణ్యంపై వర్క్‌షాపు

పెదపాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రామచంద్ర ఇంజనీరింగ్ అటానమస్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండ్రోజుల క్లౌడ్ సాంకేతిక నైపుణ్యం మీద రెండు వర్క్‌షాపు శనివారం ప్రారంభమైంది. వర్క్ షాపులో సైబర్ నేరాలు, డేటా సాంకేతీకరణ అనే అంశాలపై సాంకేతిక నిపుణులు సూర్యకుమార్ రెడ్డి, శశిధర్‌లు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టరు మురళీధరరావు మాట్లాడుతూ వర్క్ షాపుల్లో పాల్గొనడం ద్వారా సాంకేతిక జ్ఞానం మెరుగవుతుందన్నారు. సీఎస్‌ఈ హెచ్‌వోడీ డాక్టరు జి.చాముండేశ్వరి మాట్లాడుతూ సెమినార్లు, ఇండస్ట్రీకనెక్ట్ ప్రోగ్రామ్‌లు విద్యార్థుల కెరీర్ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు.

మహిళలు జీవనోపాధిని పెంపొందించుకోవాలి

ఏలూరుటూటౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జీవ నోపాధి వైపు మహిళలను నడిపించేందుకు మెప్మా ఆధ్వర్యంలో ఇస్తున్న బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా మిషన్ డైరెక్టర్ నంబూరి తేజ్ భరత్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో మెప్మా అమ లు చేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించారు. తేజ్ భరత్ మాట్లాడుతూ మహిళల కోసం మహిళా వికా సం అనే డిజిటల్ యాప్‌ను తీసుకొచ్చామన్నారు. ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామికవేత్త అనే నినాదంతో మహిళలను జీవనోపాధి వైపు నడిపించాలన్నారు. మున్సి పాల్టీల్లో తృప్తి క్యాంటీన్,అరకు కాఫీ శాఖలను మెప్మా మహిళల ద్వారా ఏర్పాటు చేయాలన్నారు. నవంబరు 5న మెప్మా ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళ నిర్వహిస్తా మన్నారు. జిల్లాలోని నిరుద్యోగులంతా తమ పేర్లు న మోదు చేసుకోవాలన్నారు. అడిషనల్ మిషన్ డైరెక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఆర్.శ్రీనివాస్, ఎస్‌ఎంఎం రంగాచారి, మెప్మా ఇన్‌చార్జి పీడీ మాధవి, హెప్సీబా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ

ఘనంగా ధన్వంతరి జయంతి

ఏలూరు రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం, ఉద్యోగుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు శుభలేఖ కల్యాణ మండపంలో శనివారం తొలి వైద్యుడు, నాయీ బ్రాహ్మణ కుల దైవం ధన్వంతరి జయంతి వేడుకలను సాహితీవేత్త డా.లంకా వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ధన్వంతరి చిత్రపటానికి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ తమ నాదస్వరంతో దైవాన్నే మేలుకొలిపే మంగళకరమైన గొప్ప సంప్రదాయం నాయీ బ్రాహ్మణులకు ఉందన్నారు.ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. విశ్రాంత డీజీపీ పూర్ణచంద్రరావు, ఏపీ వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ఘంటశాల వెంకట లక్ష్మి, బీజేపీ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏలూరు మేయర్ నూర్జహాన్ మాట్లాడారు. ఎస్‌ఎంఆర్ పెద బాబు, సీఐ రమణి,విద్యాసాగర్, ఘంటా ప్రసాద్, దేవరకొండ వెంకటేశ్వర్లు, సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పాక వెంకటేశ్వరరావు, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నరేంద్ర, కొప్పెర్ల నాగరాజు పాల్గొన్నారు. అనంతరం వైద్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న వందమందిని ఘనంగా సత్కరించారు.

దివ్యాంగుల వసతి గృహానికి దుప్పట్లు అందజేత

ఏలూరు రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఏలూరు టౌన్ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు అమరావతి అశోక్ బాబు పుట్టినరోజు సందర్భంగా అమ్మా నాన్న చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో శనివారం స్థానిక పెరుగు చెట్టు సెంటర్లో ఉన్న దివ్యాంగుల వసతి పాఠశాలలో పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వసతి గృహంలో విద్యార్థులకు దిండ్లు, పరుపులు, ఆహారం అందజేశారు. మారం హనుమంతరావు(అను), షేక్ కరీముల్లా, మారం జైసూర్య, రాజా మురళి, పొలిమేర శెట్టి గోపాలకృష్ణ, సేనాపతి జయ, సేనాపతి జయ, సేనాపతి పృథ్వీరాజ్, అందే జగదీష్, గోక నెహ్రూ, లాయర్ సురేష్, సంధ్యా, అరుణ, సురేశ్, కాసా వాసు, కోన మాణిక్యం పాల్గొన్నారు.

నిరుపయోగం!

(7వ పేజీ తరువాయి)



తుప్పలతో కనిపించకుండాపోయిన సీసీ రోడ్డు

నివాసంగా మారాయి. తుప్పలు పెరిగి సీసీ రోడ్లను కమ్మేశాయి. నార్లవరం పంచాయతీ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయం, ఆర్‌ఎస్‌కే భవనాలు నిర్మించింది. వీటిని గతంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారంభించారు. ప్రస్తుతం ఇవి ఆలంకార ప్రాయంగా మారాయి. మండలంలో రాచన్నగూడెం, పాకలగూడెం, ములగలంపల్లి ప్రాంతాల్లో నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఇళ్ల పరిస్థితి ఇలానే ఉంది. ప్రస్తుతం వీటి ఆలనా పాలనా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.



దుగ్గిరాలలో రోడ్డు శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని



ర్యాలీలో పాల్గొన్న జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ, అధికారులు



లింగపాలెంలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

స్వచ్ఛాంధ్రలో భాగం కావాలి

ఉత్సాహంగా స్వచ్ఛ అవగాహన ర్యాలీలు

ప్లాస్టిక్‌ను నిర్మూలించాలంటూ పిలుపు

మొక్కలు నాటి సంరక్షించాలని అవగాహన

ఏలూరు క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, మానవత, జిల్లా పరిషత్ ఉద్యోగుల సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జడ్పీ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలన్నారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి విద్యార్థులతో, ఉద్యోగులతో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. గంటా ప్రసాద్, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు ఎ.నాగేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్, ఎం.అజయ్‌బాబు, మానవత ఏలూరు యూనిట్ చైర్మన్ ఎ.నిర్మల, ఎం.పద్మజ, కనక దుర్గ, రత్నాకర్‌రావు, ఎ.వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పెంచాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నరసింహరావుపేటలో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి ప్రారంభించారు. ఇరువురు కలిసి మొక్కలు నాటారు. క్లీన్ ఏయిర్ థీమ్ పై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతకు చెట్లు ఎంతో ముఖ్యమన్నారు. మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఏలూరును స్వచ్ఛ నగరంగా తీర్చేందుకు ప్రజలు సహకరించాలన్నారు. నగర కమిషనర్ భానుప్రతాప్, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గా భవాని, ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు,ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి పాల్గొన్నారు.

● పోలవరం: పచ్చదనం పరిశుభ్రతతో దేశ సౌభాగ్యం పెరుగుతుందని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు.శనివారం పోలవరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో ఆయన పాల్గొన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్‌బాబు, టీడీపీ నాయకులు పోతుల శ్రీనివాస్,పాదం ప్రసాద్, గన్నిన సురేంద్రనాథ్ చౌదరి, నల్లా రాంబాబు పాల్గొన్నారు.

● ఏలూరు అర్బన్:క్లీన్ ఎయిర్ అనే అంశంపై శనివారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థినులకు వ్యాస రచన, చర్చాగోష్టి, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి, జ్యోతిర్మయి, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ చిట్టెమ్మ,ఎన్‌సీసీ మేజర్ డాక్టర్ సెలీన్‌రోజ్, ఇందిర, రత్నమేరి, జ్యోతికుమారి, అనూష పాల్గొన్నారు.

● లింగపాలెం: దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని లింగపాలెం మండల డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి అన్నారు. మండల కేంద్రమైన లింగపాలెంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శ్రమదానం చేసి పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు దుకాణాలను సందర్శించి దుకాణదారులకు, వినియోగదారులకు ప్లాస్టిక్ కవర్ల వలన జరిగే అనర్థాలను వివరించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయితీ కార్యా లయం వద్ద మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● పెదవేగి: గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా పెదవేగి మండలం దుగ్గిరాలలో శనివారం వీధులు, రహదారులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ ఇళ్లతో పాటు గ్రామాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సర్పంచ్ గుంజా క్రీస్తుమణి మధుబాబు, మాజీ ఉప సర్పంచ్ చింతమనేని సతీశ్, కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ కె.వి.రమణ మొక్కలు నాటారు. పర్యావరణాన్ని ప్రజలంతా పరిరక్షించుకోవాలని సూచించారు. సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

● పెదవేగి: పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా పెదవేగిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి, పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. అలాగే పాస్లిక్ వాడకాన్ని నిలిపివేస్తేనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యపడుతుందన్నారు.అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి డీఈవో వెంకటలక్ష్మమ్మ మధ్యాహ్న భోజనం చేశారు. ఎంఈవో- 2 వి.అరుణ్ కుమార్, పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలి

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లే అవుట్‌లలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని తహసీల్దార్ కె.స్లీవజోజి సూచించారు. శనివారం మండలంలోని లక్కవరం, చక్రదేవరపల్లి గ్రామాల్లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల్లో ఇళ్లను నిర్మించుకోకపోతే ఇంటి పట్టా రద్దవుతుందని, అదే స్థలాన్ని ఇతరులకు విక్రయించినా అది చెల్లదని తహసీల్దార్ స్లీవజోజి సూచించారు. ఇళ్లను నిర్మించుకోవడానికి ప్రభుత్వం రుణాలిస్తోందన్నారు. హౌసింగ్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

పెదపాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో సబ్బితి నరసింహమూర్తి తెలిపారు. పెదపాడు హైస్కూల్ ఉపాధ్యాయులకు జరిగిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈవో నరసింహమూర్తి పాల్గొని మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో రాయడం, అనర్గళంగా చదవడం నేర్పించాలన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులు ఆకర్షితులయ్యేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. క్లస్టర్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమడోలు ఎస్‌ఐగా మదీనా బాషా



భీమడోలు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భీమడోలు ఎస్‌ఐగా మదీనా బాషా శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా భీమడోలుకు వచ్చిన ఆయన గతంలో వీరవల్లి, మొగల్తూరు, ఏలూరు వన్‌టౌన్, టూటౌన్ ఎస్‌ఐగా పనిచేశారు. గతంలో ఇక్కడ పని చేసిన సుధాకర్ ఏలూరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయన మర్యాదపూర్వకంగా ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయుల్ని కలిశారు.

పోలసానపల్లి రోడ్డుకు మరమ్మతులు

భీమడోలు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గోతుల మయంగా మారిన పోలసానపల్లి ప్రధాన రహదారికి సర్పంచ్ షేక్ హసీనా రహీమా బేగం ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భీమడోలు, ద్వారకాతిరుమల రోడ్డు గోతుల మయం కావడంతో సర్పంచ్ గోతులు పూడ్చించారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరగబోయే ఉత్సవాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిద్దామని పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు పాలడుగు వెంకట రమాదేవి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. త్వరలో స్వామికి 108 బంగారు పుష్పాలు చేయించాలని ప్రతిపాదించి తీర్మానించారు. ట్రస్టు బోర్డు సభ్యులు ఈతకోట శ్రీనివాసరావు బంగారు పుష్పాల తయారీకై తాము రూ.50 వేలు ఇవ్వనున్నట్లు విరాళం ప్రకటించారు. కె.జ్యోతి అనే భక్తురాలు రూ.52 వేల విలువైన బంగారాన్ని చైర్మన్ రమాదేవికి అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీశ్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు పాల్గొన్నారు.

తడికలపూడిలో దీపావళి వేడుకలు

కామవరపుకోట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం తడికలపూడిలోని జీసెస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో శనివారం తెలుగు టీచర్ రత్తయ్య ఆధ్వర్యంలో విద్యార్థులతో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చీకటిని తరిమి వెలుగులు నింపేదే దీపావళి అని రత్తయ్య వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ రాంబాబు, సుధారాణి, ప్రిన్సిపల్ యోహాన్‌బాబు, మణికుమార్ పాల్గొన్నారు.

24న జాబ్ మేళా

జీలుగుమిల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): యువతి యువకులు ఈ నెల 24న జరిగే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. కొయ్యలగూడెంలో ప్రకాశం డిగ్రీ కళాశాల వద్ద జరిగే జాబ్ మేళాలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 985 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం

ద్వారకాతిరుమల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు బాలికలు ఆత్మస్థయిర్యాన్ని పెంపొందించుకోవాలని ఎంఈవో పరసా వెంకట్రావు అన్నారు. జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ద్వారకాతిరుమల జడ్పీ పాఠశాలలో అంతర్జాతీయ బాలికాదినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు.వ్యాస రచన, చిత్ర లేఖన పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్లు టి.మేరీ, కె.మణి, మహిళా కార్యదర్శులు టి.కమల, ఏఎన్ఎం రమ్య, హెచ్ఎం సరళ పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి కొప్పాక విద్యార్థులు

పెదవేగి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): డివిజినల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన పెదవేగి మండలం కొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో జరిగే జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ ఎం.మల్లిఖార్జున్ తెలిపారు. ఈ సందర్భంగా కొప్పాక జడ్పీ ఉన్నతపాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు తన్మయి, షణ్ముఖప్రియ, నితీష్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆర్.శైలజ, పీడీలు మల్లికార్జున్, దుర్గారాణిలు అభినందించారు.

యాదవ సంఘ అధ్యక్షుడిగా శ్రీను



జీలుగుమిల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం పోలవరం నియోజకవర్గ అధ్యక్షుడిగా నాలి శ్రీను ఎంపికయ్యారు. ఈమేరకు ఏలూరులో శనివారం యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు ముమ్మిడి చింతయ్య ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. కూటమి నాయకులు శ్రీను ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. సంఘం రాష్ట్ర యువత అధ్యక్షులు కాట్రు బాలు, కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్ యాదవ్, నాయకులు శివప్రసాద్, ముద్రగడ చెన్నారావు, కరెంట్ అప్పారావు, జమ్మి కృష్ణ, అల్లాడి సురేశ్, రాయి సుబ్బారావు, పి.దామోదరం, తోట బాలు, దగ్గుమిల్లి అంజనేయులు, అయ్యప్ప, రవీంద్ర, రాము, రామకృష్ణ ఉన్నారు.

రిషితకు సీఎం అభినందన



నిడమర్రు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పెద నింద్రకొలను ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న విద్యార్థిని కె.రిషితను సీఎం చంద్రబాబు అభినందించారు. రాష్ట్ర స్థాయి జి.ఎస్.టి. వ్యాస రచన పోటీలలో విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అమరావతి సచివాలయంలో సీఎం చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే డీఈవో వెంకట లక్ష్మమ్మను సీఎం అభినందించారు. రిషితను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, హెచ్ఎం మల్లిఖార్జునరావులు అభినందించారు.

వ్యాయామ కళాశాలలో వసతులు కల్పిస్తాం



దెందులూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో వసతుల కల్పనకు చర్యలు కృషి చేస్తున్నట్టు సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన రెడ్డి తెలిపారు. దెందులూరు మండలం గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో వసతుల కల్పనపై విశ్వమోహన రెడ్డి శనివారం పరిశీలించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా అవసరమైన చర్యలకు జిల్లా కలెక్టర్, సోషల్ వెల్ఫేర్ కార్యదర్శికి నివేదిక అందిస్తామని డీడీ విశ్వమోహనరెడ్డి తెలిపారు. డీడీవెంట కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేల్ ఉన్నారు.



నివాళులర్పిస్తున్న చింతమనేని, ప్రముఖులు

కలగర సేవలు చిరస్మరణీయం

ఏలూరు రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యావేత్తగా కలగర నాగలింగేశ్వరరావు సేవలు చిరస్మరణీయమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో ఇటీవల కన్నుమూసిన ఏలూరు మండల మాజీ ఎంపీపీ, విద్యావేత్త కలగర నాగలింగేశ్వరరావు సంస్మరణ సభలో ఎమ్మెల్యే చింతమనేని పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలగర కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చాటపర్రు నుంచి అమెరికా వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించి ప్రజా సేవతో పాటు గొప్ప విద్యావేత్తగా, మేధావిగా ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని అన్నారు. తోటి వారికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని కొనియాడారు. పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, కూటమి నాయకులు, కుటుంబ సభ్యులు, కోనేరు హవీశ్, కోనేరు రాజా హరీన్ - శ్రీదివ్య, నిఖిల-రాజీవ్ కార్తికేయన్, కోనేరు సత్యనారాయణ, గుత్తా పిచ్చియ్య చౌదరి, శివకాంచన లత నివాళులర్పించారు.

జీఎస్టీ సంస్కరణలపై అవగాహన

ఏలూరుటూటౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల తగ్గించిన జీఎస్టీ ఆర్థిక ప్రయోజనాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు, సేల్స్ ట్యాక్స్, రవాణా శాఖ, జడ్పీ శాఖల ఆధ్వర్యంలో నగరంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జడ్పీ చైర్ పర్సన్ గంటాపద్మశ్రీ ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్‌లు జెండా ఊపి ప్రారంభించి ద్విచక్రవాహనాల ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పద్మశ్రీ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల కొనుగోలు సామర్థ్యాలను పెంచే లక్ష్యంతో జీఎస్టీలో మార్పులు తెచ్చామన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీతో ప్రజలకు ఎన్నో ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, డిప్యూటీ మేయర్ వందనాల దుర్గా భవాని, రవాణ శాఖ డిప్యూటీ కమిషనర్ షేక్ కరీం, ఆర్‌డీఓ శేఖర్ పాల్గొన్నారు.

● చింతలపూడి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వాహనాలపై జీఎస్టీ తగ్గించారని నూజివీడు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం వాహనాలపై జీఎస్టీని తగ్గించారని, దీనిపై అవగాహన కల్పించేందుకే చింతలపూడిలో ర్యాలీ చేస్తున్నట్టు తెలిపారు. వాహనాలపై జీఎస్టీ తగ్గించడం అభినందనీయమన్నారు. అభయాంజనేయ స్వామి గుడి నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు మోటార్ సైకిళ్లపై హెల్మెట్‌లు ధరించి ర్యాలీ నిర్వహించారు.

కరాటేలో అలేఖ్య గిన్నీస్ బుక్ వరల్డ్ రికార్డు



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న అలేఖ్య

కొయ్యలగూడెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం పట్టణానికి చెందిన దాసరోజు అలేఖ్య కరాటేలో గిన్నీస్ బుక్‌వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకుంది. ఈ మేరకు చెన్నై తాంబ్రంలో జరిగిన గిన్నీస్ బుక్‌వరల్డ్ రికార్డు కరాటే ప్రదర్శనలో అలేఖ్య ప్రతిభను చాటి చేసు కుంది. దీంతో అలేఖ్యకు గిన్నీస్ బుక్‌వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకుంది. అలేఖ్య తండ్రి శ్రీధర్, జపాన్ కరాటే అసోసియేషన్‌లో సీనియర్ కోచ్. దీంతో కుమార్తెకు కూడా మంచి కోచింగ్ ఇవ్వడంతో అలేఖ్య మంచి ప్రతిభను చాటుకుని గిన్నీస్‌రికార్డులో స్థానం దక్కించుకుంది. దీంతో పలువురు అలేఖ్యను అభినందించారు.

రేషన్ షాపులో బియ్యం మాయం

చింతలపూడి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రగడవరం పంచాయతీ పాతిమాపురం షాపు నెంబర్-39లో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు పరిశీలించి సకాలంలో తెరవకపోవడం, బియ్యం షార్టేజీపై ఫిర్యాదు చేయడంతో సీలు వేశారు. షాపు తెరిచి పరిశీలించగా 33 క్వింటాళ్ల 16 కేజీల షార్టేజీ వచ్చినట్లు సివిల్ సప్లయి అధికారి దుర్గాప్రసాద్ తెలిపారు. రేషన్ డీలర్ నారపాము సుశీల తమ సొంత ఖర్చుల నిమిత్తం ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం చేరకుండా విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు. షాపును సీజ్ చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

సబ్ జైలు తనిఖీ

చింతలపూడి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ జైలును జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.మధుబాబు శనివారం పర్యవేక్షించి తనిఖీ చేశారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, మంచి నీరు, వైద్య సదుపాయాలపై సమీక్షించారు.ఉచిత న్యాయం కోసం అవగాహన కల్పించారు. వంటశాలను పరిశీలించారు. న్యాయాధికారివెంట జైలు సూపరింటెండెంట్ కృపానందం, న్యాయవాదులు ఎల్.వి.చైతన్య, ఎం.సర్వేశు, విజయరావు ఉన్నారు.

కొవ్వాసు జగదీశ్వరి జన్మదిన వేడుక

పోలవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేగొండపల్లిలో స్పోర్ట్స్ అథార్టీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పుట్టిన రోజు వేడుకలను టీడీపీ నాయకులు గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గిరిజన సాంప్రదాయ నృత్యాలతో తీన్‌మార్ డప్పులతో కన్నాపురం అడ్డరోడ్డు నుంచి వాహనాలతో ఊరేగింపు నిర్వహించిన అనంతరం భారీ విందు ఏర్పాటు చేశారు. ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జనసేన మండల నాయకులు గునపర్తి చిన్ని ఇతర నేతలు పాల్గొన్నారు.

శర్వాణీ స్కూల్లో దీపావళి వేడుక

ఏలూరు అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ఆర్‌పేట శర్వాణీ హైస్కూల్లో శనివారం దీపావళి వేడుకలు నిర్వహించారు.బాణసంచాను తల్లిదండ్రుల సమక్షంలోనే కాల్చాలని స్కూల్ డైరెక్టర్ మదనమోహనరాజు బాలబాలికలకు సూచించారు.చిన్నారులు బాణ సంచాను కాల్చారు. స్కూలు సలహాదారు సత్య నారాయణ, టీచర్లు పాల్గొన్నారు.

సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో..

పెదపాడు: వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో దీపావళి సంబరాలు శనివారం నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా ఈ పండుగను జరుపుకుంటారని ప్రిన్సిపాల్ సరళ పేర్కొన్నారు. విద్యార్థినులు దీపాలతో లక్ష్మీదేవిని అలంకరించి పూజలు నిర్వహించారు.భానుప్రకాష్, ఝాన్సీలక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

బాల ఏసు మందిరం ప్రారంభం

ఏలూరురూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): శాంతి, ప్రేమ సమాజానికి అవసరమని బాల యేసు దీవెనలతోనే అవి సాధ్యమని ఏలూరు కతోలిక పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. ఏలూరు రూరల్ మండలం పొలగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన బాల ఏసు మందిరాన్ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేనితో కలిసి ప్రారంభించారు. చింతమనేని మాట్లాడుతూ ఎంతో మంది విశ్వాసులకు బాల ఏసు ప్రార్థనలతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే చింతమనేని అన్నారు. ఎమ్మెల్యేకి బిషప్ జయరావు ఆశీస్సులు అందజేశారు. సెయింట్ మైఖేల్స్ విచారణ గురువులు ఫాదర్ దిరిసినా ఆరోన్, ఏలూరు రూరల్ మండలం క్లస్టర్ ఇన్‌చార్జి నేతల రవి, ఫాదర్లు, కూటమి నాయకులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇఫ్టూను ప్రజలు ఆదరించాలి

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు, కార్మిక హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాడుతున్న ఇఫ్టూ సంస్థను ప్రజలు ఆదుకోవాలని జిల్లా కోశాధికారి ఎం.నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని పలు డివిజన్లలో ప్రచార ప్రదర్శనను నిర్వహించారు. ఇఫ్టూ నాయకులు మాట్లాడుతూ నవంబరు 1,2,3,4 తేదీల్లో ఏలూరులో జరిగే ఇఫ్టూ రాష్ట్ర రాజకీయ తరగతులు, రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

జేసీని కలిసిన ప్లీడర్ బీజే రెడ్డి

ఏలూరు క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల జేసీగా బాధ్యతలు చేపట్టిన ఎంజే అభిషేక్ గౌడను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గవర్నమెంట్ ప్లీడర్ బీజే రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.కోర్టులో ఉన్న గవర్నమెంట్ కేసుల వివరాలను జేసీకి తెలిపారు. తన సహాయ సహకారాలు అందిస్తానని జేసీ గవర్నమెంట్ ప్లీడర్‌కు హామీ ఇచ్చారు.

డీఏ పెంపుపై ఏపీ ఎన్జీవోల హర్షం

ఏలూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి కానుకగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏ(3.64శాతం) ప్రకటించినందుకు ఉమ్మడి జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, జేఏసీ సెక్రెటరీ ఆర్.ఎస్.హరనాథ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రకటించిన డీఏ నవంబరు 1 నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు.

ఇళ్లు నిర్మించుకోవాలని ర్యాలీ

నిడమర్రు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం కేటాయించిన లబ్ధిదారుడు ఇల్లు నిర్మించు కోవాలని ఎంపీడీవో విజయకుమారి పేర్కొన్నారు. శనివారం భువ్వనపల్లి పంచాయతీ కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో లబ్ధిదారులతో మాట్లాడి త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేసుకోనేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ దుర్గాప్రసాద్, హౌసింగ్ ఏఈ హెచ్‌ఎస్‌జీఎస్ అలీ ముల్లా పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతర్ !

దీపావళి పండుగ అంటే అందరూ ఎంతో ఆనందంగా నిర్వహించుకునేందుకు ఎదురు చూస్తుంటారు. చిన్న పిల్లలైతే 15 రోజుల ముందు నుంచే పలు దుకాణాల వద్ద లభించే తుపాకీ బిళ్లలు, పాము బిళ్లలు, అగ్గిపెట్టెలు వంటి వాటిని కాల్చుతూ సంతోషిస్తారు. మరోవైపు ముందస్తు జాగ్రత్తల నేపథ్యంలో ప్రభుత్వం విధిస్తున్న నిబంధనలను వ్యాపారులు బేఖాతర్ చేస్తున్నారు. అక్కడక్కడా అధికారులు తనిఖీలు చేస్తున్నప్పటికీ అధికారుల పూర్తి నిఘా వైఫల్యంతో మరిన్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

- ఉమ్మడి పశ్చిమ జిల్లాలో బాణసంచా వ్యాపారుల నిర్వాకం
- శివకాశీ నుంచి బాణసంచా లారీల రాక..
- ఏలూరు సమీపంలో రహదారులపైనే పార్కింగ్
- బిల్లులు లేకుండా అక్రమ మార్గంలో రవాణా
- జనవాసాల మధ్యలోనే బాణసంచా తయారీ
- నిఘా వైఫల్యం.. పొంచి ఉన్న ప్రమాదాలు

ఏలూరు క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా భద్రత నిమిత్తం దీపావళి షాపుల ఏర్పాటుకు ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు ఇస్తుంది. కొన్ని తయారీ కేంద్రాలు, కొన్ని నిల్వ కేంద్రాలకు అనుమతులు అందిస్తున్నాయి. ఏలూరు జిల్లాలో శాశ్వత బాణసంచా నిల్వలు, విక్రయాలకు సంబంధించి 15 షాపులు, పశ్చిమ గోదావరి జిల్లాలో 40 షాపులకు అనుమతులు ఉన్నాయి. వీరు పలు తారాజువ్వలు, మందుగుండు సామగ్రి విక్రయించుకోవడానికి అనుమతులు ఉన్నాయి. వీరికి 50 కేజీల నిల్వ నుంచి 500 కేజీల వరకు సాధారణంగా అనుమతులు తీసుకుంటారు. కానీ వారి వద్ద వేల కేజీల్లోనే నిల్వలు ఉంచుతారు. వీరు తీసుకునే అనుమ తులు 50 కేజీల వరకు అనుమతి అని చెబుతారు.. కానీ విక్రయించేది వేల కేజీల్లోనే ఉంటుంది.

శివకాశీ నుంచి సరుకు దిగుమతి..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో షాపుల నిర్వాహకులు తమిళనాడులోని శివకాశీ నుంచి నేరుగా అక్కడ వ్యాపారులతో ముందుగానే ఒప్పందాలు చేసుకుని లారీ లోళ్లను తమ షాపులో ఉన్న సమీప ప్రాంతాలకు తీసుకువచ్చి జాతీయ రహదారిలోనూ, సర్వీసు రోడ్డుల్లోనూ లేదా మరే ఇతర రోడ్లలో ఆ లారీలను పార్కు చేయించి ఉంచుతున్నారు. షాపులో సరుకులు అయిపోగానే ఆ లారీని సమీపానికి తీసుకువచ్చి మళ్లీ దిగుమతులు చేస్తున్నారు. వాస్తవానికి వారు తీసుకువచ్చే మందుగుండు సామగ్రికి వాణిజ్య పన్నుల శాఖాధికారులు తనిఖీలు చేయాల్సి ఉన్నా ఆ శాఖ అధికారులు

అనుమతులు తక్కువ.. నిల్వలు ఎక్కువ

తనిఖీలు చేసిన దాఖలాలు కానరాలేదు. శివకాశీ నుంచి ఏలూరు జిల్లాకు 350 లారీల సరుకు, పశ్చిమ గోదావరి జిల్లాకు 500 లారీలు, తూర్పు గోదావరి జిల్లాలోని నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం ప్రాంతాలకు 150 లారీలకుపైగా సరుకు వస్తున్నట్లుగా అక్కడ వ్యాపారులు చెబుతున్నారంటే ఇక్కడ కనిపించేది కేవలం కొద్ది సరుకు విక్రయించిన వెంటనే మళ్లీ సరుకు తీసుకువచ్చి పెడుతూ ఉంటారు.

పెద్దఎత్తున విక్రయ కేంద్రాలు..

బాణసంచా విక్రయ కేంద్రాలు పెద్దఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఏర్పాటుకు రెవెన్యూ, పోలీసు, ఫైర్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇస్తుంటారు. జనవాసాల మధ్య వీటిని ఏర్పాటు చేయకూడదని, గతంలో జరిగిన ప్రమాదాల దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ఆ దిశగా షాపులను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఏలూరులోని ఒక షాపు నిర్వాహకుడు ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా సామగ్రి నిల్వ చేసి చిన్న చిన్న కిరణా షాపుల వారికి కిరాణా సరుకుల్లా విక్రయించాడు. అతడి వద్ద నుంచి ఉల్లిపాయల బాణసంచాను బస్తాలో వేసుకుని స్కూటర్ మధ్యలో పెట్టుకుని వెళ్తుండగా ప్రమాదం జరిగి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఏడుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదంపై ఎలాంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించిన వ్యక్తిపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

బిల్లులు లేకుండా బాణసంచా నిల్వలు !

పండుగ రోజు విక్రయాలు చేసేందుకు చిల్లర వర్తకులు, హోల్‌సేల్ వ్యాపారుల నుంచి బాణ సంచా కొనుగోలు చేస్తుంటారు. ఇప్పటికే భారీ ఎత్తున బాణసంచా నిల్వలు పెట్టారు. వీటికి ఎలాంటి బిల్లులు ఉండడంలేదని తెలుస్తోంది. జిల్లాలో విస్తృతగా తనిఖీలు చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులు, రెవెన్యూ, ఫైర్, పోలీస్ శాఖల ను ఆదేశించారు. వారి ఆదేశాలతో జిల్లాలో అక్కడక్కడ ఈ బాణసంచా సామగ్రి నిల్వలపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఏలూరు, పరిసర గ్రామాల్లో అక్రమ మందుగుండు సామగ్రిని గుర్తించి పోలీసులు సంబంధిత వ్యక్తులను అరెస్టు చేశారు. ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సత్రంపాడులోని ఎంఆర్‌సీ కాలనీలో ఇద్దరు వ్యక్తులు అత్యంత ప్రమాదకరమైన నార బాంబులను తయారు చేస్తున్నారు. జనవాసాల మధ్య వీటిని తయారు చేయడంతో పట్టుకున్న పోలీసులే అవాక్కయ్యారు.

బాణసంచా అక్రమ నిల్వలు.. ముగ్గురి అరెస్టు

ఏలూరు క్రైం : జన నివాసాల మధ్య బాణసంచా అక్రమంగా నిల్వలు ఉంచిన ముగ్గురు యువకులను ఏలూరు టూటౌన్ సీఐ కె. అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ లక్ష్మీనారాయణ శనివారం అరెస్టు చేశారు. ఏలూరు టూటౌన్ పరిధిలోని గానుగులపేట విమలాదేవి స్కూల్ సమీపంలో బోర్ల లక్ష్మి అనే మహిళ ఇంట్లో కె.కనకరాజు, గంగ, యశ్వంత్ కలిసి తాడేపల్లిగూడెంలో రూ.40 వేల విలువైన బాణసంచా సామగ్రి కొనుగోలు చేసుకుని బూర్ల లక్ష్మి ఇంట్లో దాచి విక్రయించడానికి సిద్ధమయ్యారు. ఈ సమాచారం అందడంతో ఏలూరు టూటౌన్ పోలీసులు శనివారం రాత్రి ఆ ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ సెన్సార్‌తో వెలిగే ప్రమిదలు


నీటితో వెలిగే సెన్సార్ దియా, వాటర్ లెడ్ ప్రమిదలు

తణుకు రూరల్ : దీపావళికి ప్రధాన ఆకర్షణగా నిలిచేవి దీపాలు. ఇప్పటివరకు ప్రమిదలలో నూనె పోసి వాటిలో ఒత్తులు వేసి వెలిగించే వారు. ఈ ప్రమిదలు కూడా అనేక రకాల కలర్స్‌లో వచ్చాయి. నూనె, ఒత్తులు అవసరం లేని ప్రమిదలు అందుబాటులోకి వచ్చాయి. ఫైబర్ ప్రమిదల్లా వుండే ప్రమిదలకు ఒక ఎలక్ట్రానిక్ బల్బు ఏర్పాటు చేసి దాని కింద భాగంగా చిన్న బ్యాటరీని అమర్చారు. దానికి రెండు చివరలు ఏర్పాటు చేసి వాటికి నీరు తగిలే ఏర్పాటు చేయడంతో నీరు పోయగానే విద్యుత్ కొనలకు ఎర్త్ జరిగి ప్రమిదల చివరన ఏర్పాటు చేసిన బల్బు వెలుగుతుంది. న్యూఢిల్లీకి చెందిన సెన్సార్ దియా, వాటర్ లెడ్ పేరుతో రూపొందించిన ఈ సెన్సార్ ప్రమిదలు దీపావళి బాణ సంచా దుకాణాల వద్ద ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీటితో వర్షంలో దీపం ఆరిపోవడం గానీ, ఈదురు గాలులకు ఆరిపోవడం గానీ జరగదు. చిన్న పిల్లలకు కాలుతుందని, షాక్ కొడుతుందనే భయం లేదు. ఒక్కో బాక్సు రూ.100 కాగా, ఒక్కో బాక్సులో ఆరు ప్రమిదలు వున్నాయి. ఇవి సుమారు 72 గంటల పాటు ఏకధాటిగా పనిచేస్తాయని విక్రేత సంకు ఏసుబాబు తెలిపారు. గత ఏడాది నుంచి వీటిని విక్రయిస్తున్నట్లు తెలిపారు.


తణుకు-దువ్వ హైవేపై బాణసంచా కొనుగోలుకు బారులు తీరిన వాహనాలు.. షాపుల్లో అమ్మకాలు

దువ్వలో ముమ్మరంగా బాణసంచా అమ్మకాలు

తణుకు రూరల్: తణుకు మండలం దువ్వ హైవే పక్కన బాణసంచా అమ్మకాలు ము మ్మరంగా సాగుతున్నాయి. హైవే పక్కన శాశ్వత ప్రాతిపదికన షాపులు ఏరాపటు చేయడంతో బాణసంచా అమ్మకాలతో రద్దీ పెరిగింది. ప్రతి ఏడాది దీపావళికి రెండు రోజులపాటు తాత్కా లిక లైసెన్స్‌లతో నిర్వహించే బాణసంచా షాపు లను ఈ ఏడాది తణుకు జాతీయ రహదారి పక్కన ఫైడిపర్రులో ఏర్పాటు చేయడంతో పట్టణంలో రద్దీ తగ్గింది. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగాయి. తణుకు పట్టణంలో గత ఏడాది కంటే తాత్కాలిక షాపుల ధర పెరగడంతో మొత్తం షాపులు తగ్గాయి. గతంలో సుమారు 50 షాపులు ఉండేవి. ప్రస్తుతం 40 షాపులకే పరిమితమయ్యాయి. గతంలో ఒక్కో షాపునకు రూ.15వేలు వసూలు చేయగా ప్రస్తుతం రూ.35 వేలకు పెరిగిందని వ్యాపారులు తెలిపా రు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు రావ డంతో అమ్మకాలపై ప్రభావం పడుతుందని వ్యాపారుల్లో ఒకింత భయం నెలకొంది.


శ్రీవారి దర్శనానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో వేచిఉన్న భక్తులు

మార్మోగిన గోవింద నామస్మరణ

ద్వారకాతిరుమల, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): గోవింద నామ స్మరణతో చిన్న తిరుమలేశుని క్షేతం మార్మోగింది. అమావాస్య ముందురోజులు కావడంతో భక్తుల రద్దీ కాస్త తగ్గినా వేలాది మంది ఆలయానికి శనివారం విచ్చేశారు. స్వామికి ఇష్టమైన రోజు కావడం వల్ల భక్తుల రాకతో ఆలయం కళకళలాడింది. ఆలయానికి దాదాపు 15వేల మంది వరకు భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. ఆలయానికి వచ్చిన పలువురు యాత్రికులు ముందుగా కేశఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీవారి సాధారణ దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది.

జేఎన్వీలో 9,11 తరగతుల ఖాళీల భర్తీకి గడువు పెంపు

పెదవేగి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ)లో 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల తేదీని ఈనెల 23వ తేదీ వరకు పొడిగించామని ప్రిన్సిపాల్ పరశురామయ్య తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థులు 9వ తరగతికి సంబంధించి https://cbseitms.nic.in/2025/nvsix వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. 11వ తరగతికి దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు https://cbseitms.nic.in/2025/nvsxi వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మార్పులు, చేర్పులకు ఈనెల 24 నుంచి 26 వరకు అవకాశం కల్పించామన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెదపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గోపన్నపాలెంలో ఈనెల 17వ తేదీన జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) డివిజన్ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని ఐదుగురు విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పెదపాడు మండలం వీరమ్మకుంట పాఠశాల హెచ్.ఎం. రామ్‌ప్రసాద్ తెలిపారు. టి.సిద్ధు (వాలీబాల్), ఎం.వినీల్ (కబడ్డీ), ఎం.గణేష్, గిరిహనుమాన్ (కబడ్డీ), బాలికల విభాగంలో వి.లాస్య (కబడ్డీ) ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాలలో శనివారం ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పాలకొల్లులో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏఎంసీ చైర్మన్, సభ్యులతో మంత్రులు, ముఖ్య అతిథులు.. ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్ దంపతులకు సత్కారం

మార్కెట్ కమిటీల స్వయం ప్రతిపత్తికి ఆదేశాలిచ్చాం

- మంత్రి అచ్చెన్నాయుడు
- ఏఎంసీ చైర్మన్‌గా విజయ భాస్కర్, వైస్ చైర్మన్‌గా రత్నంరాజు ప్రమాణ స్వీకారం

పాలకొల్లు అర్బన్/పోడూరు/పాలకొల్లు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీలు సెస్ ద్వారా వచ్చే ఆదాయంపై పాలక వర్గాలే నిర్ణయం తీసుకోవడంతో పాటు స్వయం ప్రతిపత్తి కలిగేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. పాలకొల్లు ఏఎంసీ ఆవరణలో శనివారం స్థానిక మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అధ్యక్షతన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేశారు. ఏఎంసీ చైర్మన్‌గా కోడి విజయభాస్కర్, వైస్ చైర్మన్‌గా మాతా రత్నంరాజు, పాలకవర్గ సభ్యుల చేత మార్కెటింగ్ శాఖ జేడీ శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గత ఐదేళ్ల జగన్ పాలనలో పరిపాలన కుంటుపడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. సభలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, పీతల సుజాత, కుడిపూడి సత్తిబాబు, పెచ్చెట్టి చంద్రమౌళి, వలవల బాబ్జి, పొత్తూరి రామరాజు, కొత్తపల్లి సుబ్బారాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ గాంధీ భగవాన్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ఉన్నమట్ల కపర్ది, వై.పద్మారావు, దేవళ్ల ప్రసాద్, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, పీతల శ్రీను, తులా రామలింగం తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా అతిథులను పాలకవర్గం ఘనంగా సత్కరించింది. పాలక వర్గ చైర్మన్ కోడి విజయభాస్కరరావు, మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మి దంపతులను ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించారు. తొలుత స్థానిక మంత్రి కార్యాలయం వద్ద నుంచి భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించి, పూలపల్లి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి అనంతరం మార్కెట్ కమిటీ ప్రాంగణానికి చేరుకున్నారు. మంత్రి నిమ్మల బైక్‌పై కోడి విజయభాస్కర్ కూర్చుని రాగా, అచ్చెన్నాయుడు బైక్ నడుపుతూ వచ్చారు. కార్యక్రమంలో మహ్మద్‌జా, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గానికి ప్రముఖుల అభినందనలు

పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కోడి విజయభాస్కర్, వైస్ చైర్మన్‌గా దాసరి రత్నరాజు, పాలకవర్గ సభ్యులను రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాస్‌లతో పాటు మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ తదితరులు అభినందనలు తెలిపారు.


వైద్యురాలిని సత్కరిస్తున్న ఆరిమిల్లి.. కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

తణుకు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం తణుకు వీకే కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్యే ఆరిమిల్లి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి రూ25 లక్షల బీమా సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయిం చిందన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య సేవ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. సొంత ఖర్చులతో వైద్యం చేయించుకున్న వారికి సీఎం సహాయనిధి నుంచి నిధులు కేటాయిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

రెండు వేల మందికి ఉచిత వైద్య పరీక్షలు

మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి తణుకు నియోజకవర్గం నుంచి విశేష స్పందన లభించింది. సుమారు రెండు వేల మంది ప్రజలు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి విచ్చేశారు. నిడదవోలు రాజరాజేశ్వరి రామకృష్ణ లయన్స్ కంటి ఆసుపత్రి, అలంపురం ట్రస్టు ఆసుపత్రి, ఏలూరు ఆశ్రం ఆసుపత్రి నుంచి వైద్యులు వీణ, మహాలక్ష్మి, స్మృతి, రేఖాకీర్తి, సౌజన్య, చందన ప్రియాంక, రషీద్, హుస్సేన్, ఆదిత్య రెడ్డి, లక్ష్మీసరోజ, ఝాన్సీరాణితో పాటు సిబ్బంది కంటి పరీక్షలు నిర్వ హించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులను సత్కరించారు. మునిసిపల్ కమిషన ర్ టి.రామ్‌కుమార్. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయి కిరణ్‌తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజల్లో కొత్త వెలుగు

కేంద్ర, రాష్ట్రాల్లో ప్రజల కోసం పని చేసే ప్రభుత్వాలు : మంత్రి

- 'గూగుల్' రాకతో 2 లక్షల మందికి ఉపాధి : మంత్రి సుభాష్
- కూటమి హయాంలోనే హార్బర్ నిర్మాణం : విప్ నాయకర్

నరసాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):'జీఎస్టీ తగ్గింపుతో ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపనున్నాయి, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని అమలు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నా యి. రెండు చోట్లా పని చేసే ప్రభుత్వాలే ఉండడం వల్ల అభివృద్ధి, సంక్షేమం వైపు దూసుకుపోతున్నాయని' కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాష్, విప్ నాయకర్ అన్నారు. శనివా రం నరసాపురంలో 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా పడవలతో వశిష్ఠ గోదావరిలో విస్తృతంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వలంధర్ రేవు నుంచి రాజుల్లంక వరకు సుమారు వంద పడవలతో సాగిన ర్యాలీలో మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి వర్మ మాట్లాడుతూ నరసాపురం- చెన్నై మధ్య ప్రతిపాదించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ త్వరలో పట్టాలపైకి వస్తుందని, రైల్వే బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ గూగుల్ సంస్థ రాకతో రాష్ట్రంలో రెండు లక్షల మందికి ఉద్యోగాలు కల్పించనుందన్నారు. విప్ నాయకర్ మాట్లాడుతూ బియ్యపుతిప్ప హార్బర్ నిర్మాణం కూటమి హయాంలోనే జరుగుతుందన్నారు. మత్స్యకారు లకు వేట నిషేధ భృతి రూ.20 వేలకు పెంచిన ఘనత కూటమికే దక్కిం దన్నారు. నియోజక వర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గుదలతో వలల ధరలు రూ. 80వేలు, ఇంజన్ ధరలు రూ.20వేల వరకు తగ్గనున్నాయన్నారు. అనంతరం రెండు మత్స్యకార సొసైటీలకు ప్రధానమంత్రి మత్స్యకార యోజన కింద రూ. 10 లక్షల చెక్కును అందించారు. ఆర్డీవో దాసిరాజు, షైలా వసంతరావు, కబర్ది, చాగంటి చిన్న, జక్కం శ్రీమన్నారాయణ, పోలిశెట్టి శ్రీనివాస్, పీపీఆర్, కమిషనర్ అంజయ్య, అధికారులు పాల్గొన్నారు.


పడవల ర్యాలీ.. (ఇన్‌సెట్‌లో) ర్యాలీని ప్రారంభించిన మంత్రి వర్మ

క్రైం సమాచారం

రైల్వే ప్లాట్‌ఫామ్‌పై వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్‌లో ఒక గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడని ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే ఎస్ఐ శివన్నారాయణ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు ఏలూరు కొత్తూరు రోడ్డులోని క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో పోలీస్ కాలనీలో నివాసం ఉంటున్న సుంకర జగ్గారావు(75)గా గుర్తిం చారు. అనారోగ్యంతో అతడు మరణించి ఉంటాడని భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

పొలంలో పురుగుల మందు కొట్టి.. అస్వస్థతకు గురై యువకుడి మృతి

ఏలూరు క్రైం : పొలంలో పురుగు మందు కొట్టిన ఒక యువకుడు ఆ ఘాటుకు తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. దెందులూరు మండలం జోగన్నపాలెం గ్రామానికి చెందిన పసుమర్తి లక్ష్మణరావు(33) శనివారం పొలంలో పురుగుల మందు కొట్టడానికి వెళ్లాడు. ఆ ఘాటుకు తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి శనివారం సాయంత్రం తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

'బ్యాంక్ ఆఫ్ బరోడా'లో మంటలు


దగ్ధమైన విద్యుత్ మీటరు

ఏలూరు క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఏలూ రు అమీనాపేట బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకులో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. లోపల నుంచి పొగ, మంటలు వ్యాపించడంతో స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి రామకృష్ణ తమ సిబ్బందితో వెళ్లి మంటలను అదుపు చేశారు. బ్యాంకులో ఉన్న విద్యుత్ మీటరు వద్ద షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు వ్యాపించాయని, సత్వరమే అదుపు చేయడంతో ఇబ్బంది లేదని అధికారులు తెలిపారు.

బోల్తా పడిన పండ్ల వ్యాన్


తిరగబడిన సీతాఫలాల లోడు వ్యాన్

జీలుగుమిల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి పోలీ స్‌స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి పక్కపక్కనే వెళుతున్న రెండు లారీలు ఢీకొన్న సంఘ టన జరిగింది. మహారాష్ట్ర నుంచి సీతాఫలాలు, దానిమ్మ పండ్ల లోడుతో ఐషర్ వ్యాన్ కోల్‌కతా వెళుతుండగా మరో లారీ ఖమ్మం వైపు నుంచి కాకినాడ పోర్టుకు గ్రానైట్ రాళ్లు తరలిస్తోంది. స్టేషన్ సమీపంలో వెళుతున్న గ్రానైట్ రాళ్ల లోడు లారీని పండ్ల లోడుతో వెళుతున్న ఐషర్ వ్యాన్ ఓవర్ టేక్ చేసే సమయంలో ఒకదానికొకటి ఢీకొని రోడ్డుకు అడ్డంగా ఐషర్ వ్యాన్ బోల్తా పడింది. ముందు భాగం నుజ్జునుజ్జయింది. రహదారిపై గంటసేపు ట్రాఫిక్ నిలిచింది. సంఘటన స్థలాన్ని ఎస్ఐ వి.క్రాంతికుమార్ పరిశీలించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంలో లారీల్లో వారికి ఎటువంటి ప్రాణహాని జరగలేదు.

అనుమతులు లేని శిశువిహార్ పాఠశాలకు
మండల విద్యాశాఖ నోటీసులు


మండల విద్యాశాఖాధికారులకు లేఖ అందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్

పోలవరం అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): పోలవరంలో జిల్లా విద్యాశాఖ అనుమతులు లేకుం డా నిర్వహిస్తున్న సిరివెన్నెల శిశు విహార్ పాఠశాలకు మండల విద్యాశాఖా ధికారులు సత్యనారాయణ, మూర్తి శనివారం నోటీసులు అందించి మూయించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ చంద్రకళ లిఖిత పూర్వకంగా పాఠశాలను మూసి వేస్తున్నట్టు విద్యాశాఖాధికారులకు లేఖ అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు సిరివెన్నెల శిశు పాఠశాలను మూసివేసినట్టు తెలిపారు. అనుమతులు లేని పాఠశాలలలో విద్యార్థులను చేర్పడం ద్వారా విద్యా సంవత్సరం వృథా అవుతుందని, ఇలాంటి పాఠశా లల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందే 'తల్లికి వందనం' వంటి సంక్షేమ పథకాలు వర్తించవని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. జిల్లా విద్యాశాఖ అనుమతులు నిరాకరించి పాఠశాలను మూసివేసిన నేపథ్యంలో పాఠశాల నిర్వాహకులు సిరివెన్నెల శిశువిహార్ పాఠశాల పేరు మార్చి ట్యూషన్ సెంటర్‌గా మారుస్తున్నట్టు ప్రకటించి పాఠశాల నిరంతరాయంగా నిర్వహించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు చింతపాడు విద్యార్థి

మండవల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థి జయమంగళ నాగ మణికంఠ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గుడివాడలో 17న జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా విభాగంలో నాగమణికంఠ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంతో జిల్లా జట్టుకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం భాగ్యలక్ష్మి తెలిపారు. మణికంఠను ఎస్‌ఎంసీ చైర్మన్ ముంగర రజనీ, ఉపాధ్యాయులు అభినందించారు.

22 నుంచి సైన్స్ సంబరాలు

నూజివీడు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించేందుకు జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలను ఈ నెల 22 నుంచి నిర్వహించనున్నట్లు వేదిక కార్యదర్శి నారాయణరావు తెలిపారు. పల్లెర్లమూడి పాఠశాలలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. 22న పాఠశాల స్థాయి చెకుముకి పరీక్షలు, నవంబరు 1న మండల స్థాయి, 23న జిల్లాస్థాయి, డిసెంబరు 12 నుంచి 14 వరకు రాష్ట్రస్థాయి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మొక్కలు నాటుతున్న సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి, యూబీ బీఎం లోవా

మండవల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాదారులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి అన్నారు. శనివారం భైరవపట్నంలో యూనియన్ బ్యాంక్ కైకలూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. గ్రామ సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో అందించే సేవలను వివరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాదారులంతా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఫోన్లో ఉచితంగా డబ్బులు వచ్చే మెసేజ్‌ల జోలికి వెళ్లవద్దని, ఎవరైనా ఓటీపీలు అడిగితే చెప్పవద్దని, అవసరమైతే దగ్గర్లో ఉన్న పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయాలన్నారు. బ్యాంక్ మేనేజర్ డీవీఎస్ లోవా, బ్యాంక్ సిబ్బంది హరిబాబు, మణికుమార్, కిరణ్, సుబ్రహ్మణ్యం, కూటమి నేతలు చాపరాల దుర్గాప్రసాద్, చదలవాడ శేషగిరిరావు, బొల్లంపల్లి కృష్ణారావు, సజ్జా బాబి, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజధానికి విరాళాలిచ్చిన పురోహితులకు సత్కారం



ముదినేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని నిర్మాణానికి తమ వంతు విరాళాలివ్వాలని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి పిలుపునకు స్పందించి ముదినేపల్లి మండలం గురజ గ్రామంలోని పురోహితులు, అర్చకుల కుటుంబాలు ముందుకు వచ్చాయి. శనివారం గురజ శివాయంలో వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్ నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 20 పురోహితులు, అర్చకుల కుటుంబాలు తమ వంతు విరాళాలు రూ. 20 వేలను ఏపీసీఆర్‌డీఏ బ్యాంక్ ఖాతాకు క్యూ ఆర్ కోడ్ ద్వారా పంపించారు. ఈ సందర్భంగా విరాళాలిచ్చిన దంపతులను డాక్టర్ మనోజ్ సత్కరించారు.

టీటీడీకి 12 టన్నుల కూరగాయలు

నూజివీడు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంగమాంబ అన్నదాన సత్రానికి నూజివీడు శ్రీ వెంకటేశ్వర భక్తబృందం తరపున 12 టన్నుల కూరగాయలను అందించారు. టీటీడీ ప్రత్యేక వాహనంలో వీటిని తరలించారు. ఇప్పటి వరకు టీటీడీకి శ్రీ వెంకటేశ్వరస్వామి భక్తబృందం తరపున 33 పర్యాయాలు, ద్వారకా తిరుమలకు 33 పర్యాయాలు, శ్రీశైలానికి 20 పర్యాయాలు కూరగాయలను వితరణగా అందించినట్లు భక్త బృందం సభ్యుడు ఎస్.సత్యానారాయణ తెలిపారు. పల్నాటి కొండలరావు, కోసూరి రాంబాబు, గవిర్నేని ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలపై అవగాహన ర్యాలీలు



కైకలూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ ఉత్సవాల్లో భాగంగా ఏలూరు జిల్లా ఆర్టీఏ అధికారుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఏ ఇన్‌స్పెక్టర్ వై సురేష్‌బాబు మాట్లాడుతూ వాహనాలపై ప్రభుత్వం 10 శాతం జీఎస్టీని తగ్గించిందని ప్రజలు గమనించి కొనుగోలు చేయాలన్నారు. అలాగే ఎక్కడైనా ధరలు తగ్గించకుంటే ఆర్టీఏ, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే అన్ని రకాల వస్తువులపై ధరలు తగ్గాయని కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణపై అందరూ అవగాహన కల్గియుండాలన్నారు. ర్యాలీని డ్వామా ఏపీడీ విక్టర్ ప్రారంభించారు. తహసీల్దార్ లతీఫ్ పాషా, ఎంపీడీవో ఆర్. రాజాబాబు, ఆర్టీఏ ఇన్‌స్పెక్టర్ వై. కల్యాణి, కూటమి నేతలు పూల రామచంద్రరావు, కేవీఎస్ఎం నాయుడు, కేకే బాబు, మంగినేని రామకృష్ణ, ఎస్. ఏసుబాబు, టౌన్ ఎస్సై ఆర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: కేంద్రం ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్టీతో వాహన ధరలు గణనీయంగా తగ్గాయని నూజివీడు ఇన్‌చార్జ్ ఎంవీఐ కృష్ణవేణి అన్నారు. నూజివీడులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ స్కూటర్లు, ట్రాక్టర్లు, కార్లు తదితర మోటారు వాహనాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడంతో ఒక్కో వాహనంపై రూ. ఐదు వేల నుంచి రూ.50వేల వరకు తగ్గుదల ఉందన్నారు. వాహనాలపైనే కాక విడిభాగాలపై కూడా జీఎస్టీ తగ్గిందని, ప్రతి వినియోగదారుడు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు రమణక్కపేట విద్యార్థిని

ముసునూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు రమణక్కపేట జడ్పీపాఠశాల విద్యార్థిని ఎంపికైంది. చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఇందుప్రియ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి డెహ్రాడూన్‌లో త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీలలో ఏపీ జట్టులో స్థానం సాధించినట్లు పీడీ వాకా నాగరాజు తెలిపారు. అలాగే ముసునూరు జడ్పీపాఠశాలకు చెందిన పి.సంతోష్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం. శైలజ తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు సంతోష్‌ను అభినందించారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుంటే రద్దు


చాట్రాయి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ దశల్లో ఉన్న బలహీన వర్గాల పక్కా గృహాలను డిసెంబరు 31 లోగా పూర్తి చేసుకోవాలని, లేకపోతే రద్దయ్యే అవకాశం ఉన్నదని మండల హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ శ్రీనివాసరావు అన్నారు. చనుబండ సచివాలయంలో శనివారం గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. మండలంలో వివిధ దశల్లో 281 గృహాలు ఉన్నాయని నిర్మాణం త్వరగా పూర్తి చేసుకుంటే బిల్లులు విడుదల అవుతాయని వివరించారు. మండల టీడీపీ నాయకుడు నక్కా రాము మాట్లాడుతూ మంత్రి పార్థసారథి చొరవతో పెండింగ్ బిల్లులు విడుదల చెయ్యటం వల్ల కొన్ని వేల పేద కుటుంబాలకు అప్పుల భారం తగ్గిందని, పేదల తరఫున మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

జేఎన్వీలో 9,11 తరగతుల ఖాళీల భర్తీకి గడువు పెంపు

పెదవేగి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ)లో 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల తేదీని ఈనెల 23వ తేదీ వరకు పొడిగించామని ప్రిన్సిపాల్ పరశురామయ్య తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థులు 9వ తరగతికి సంబంధించి https://cbseitms.nic.in/2025/nvsix వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. 11వ తరగతికి దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు https://cbseitms.nic.in/2025/nvsxi వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన వారికి మార్పులు, చేర్పులకు ఈ నెల 24 నుంచి 26 వరకు అవకాశం కల్పించామ న్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



బోధనేతర పనుల బహిష్కరణ

ముదినేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు శనివారం బోధనేతర పనులను బహిష్కరించారు.


జనార్దనవరంలో ర్యాలీ


నూజివీడు ఆర్టీసీ డిపో వద్ద చెత్త తొలగింపు


కలిదిండి మండలంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

▸స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో వక్తలు ▸ర్యాలీలు ▸తుప్పల తొలగింపు ▸మొక్కలు నాటి ప్రతిజ్ఞ

చాట్రాయి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్య జీవనం సాధ్యమవుతుందని అందరూ గుర్తించాలని నూజివీడు డివిజనల్ అభివృద్ధి అధికారి, మండల స్పెషలాఫీసర్ వెంకటరత్నం అన్నారు. మూడో శనివారం సందర్భంగా చాట్రాయి, జనార్దనవరం గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలు నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటి ప్రజలతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పారబోయటం వల్ల అపరిశుభ్రత నెలకొని వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నదని, ప్రతి ఒక్కరు బాధ్యతగా ఇంటి ముందుకు వచ్చే చెత్త బండిలో చెత్త వేయాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు మాదాసు చిన్న పుల్లయ్య, మాదాసు చంద్రకళ అధికారులు పాల్గొన్నారు.

కలిదిండి: జలవనరుల శాఖ ఆధ్వర్యంలో శనివారం అమరావతి, సంతోషపురం, భాస్కరరావు పేట, మూల్లంక గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా కాల్వ వెంబడి ఉన్న చెత్త కుప్పలను తొలగించారు. పారిశుధ్యంపై అధికారులు, కూటమి నాయకులు ప్రజలకు అవగాహన కల్పించారు. కాల్వ వెంబడి చెత్త కుప్పలు వేస్తే రూ.2 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, ఎత్తిపోతల కమిటీ చైర్మన్ వి.చిన్నారావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌చార్జ్ అక్కల బోసు, దున్న భోగేశ్వరరావు, ఎంపీడీవో ఫణీంద్ర, తహసీల్దార్ రామకృష్ణ, ఇరిగేషన్ ఈఈ ఫణికుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని డిప్యూటీ ఎంపీడీవో ఆనంద్‌బాబు అన్నారు. ఆగిరిపల్లిలోని శనివారం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం వద్ద నిర్వహించిన స్వచ్ఛ కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ చొటపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: పారిశుధ్యం మెరుగుదలతో ఆరోగ్యకర వాతావరణాన్ని భావితరాలకు అందించవచ్చని ఆర్టీసీ డీఎం అంజనేయులు అన్నారు. నూజివీడు ఆర్టీసీ డిపో, బస్టాండ్‌లలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, నూజివీడు సిద్దార్థ విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సిద్దార్థ కళాశాల విద్యార్థులు ఆర్టీసీ డిపో ప్రాంగణంలో పిచ్చిమొక్కలను తొలగించారు. ఆర్టీసీ సిబ్బంది, సిద్దార్థ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.


ముదినేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీడీవో రామకృష్ణ

ముదినేపల్లి: ముదినేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఎంపీడీవో వై.రామకృష్ణ, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, డిప్యూటీ ఎంపీడీవో అశోక్, ఉప సర్పంచ్ ఈడే సుధాకర్, పంచాయతీ కార్యదిర్శ రమేష్ మొక్కలను నాటారు. వీధులను శుభ్రం చేశారు. అనంతరం గ్రామస్థులు, ఉద్యోగులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. పెదగొన్నూరులో సర్పంచ్ తాడంకి శిరీష ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించారు. జనసేన, బీజేపీ నాయకులు వేల్పూరి నానాజీ, మీసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ

బాధితులకు న్యాయ సహాయం

నూజివీడు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాధితులకు న్యాయ సహాయం అందించేందుకు మండల న్యాయ సేవాధికార సంస్థ చర్యలు చేపడుతోందని, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ అన్నారు. తుక్కులూరులో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టం, బాల్యవివాహాల నిరోధం, మహిళా చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, గ్రామ సచివాలయం కార్యదర్శి చంద్రిక, క్లస్టర్ సీసీ ఎలీనారాణి తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధే ధ్యేయం

కలిదిండి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రహదారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కూటమి నాయకులు పేర్కొన్నారు. రూ.2.40 కోట్లతో నిర్మించే కాళ్లపాలెం-తాడినాడ రహదారికి శనివారం శంకుస్థాపన చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, అగ్నికుల, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ల చైర్మన్లు అంద్రాజు శ్రీనివాస్, లంకా రత్నారావు, టీడీపీ ప్రధాన కార్యదర్శి సీతా రామాంజనేయులు, బీజేపీ మండల అధ్యక్షుడు దుర్గాప్రసాద్, జనసేన నాయకుడు ఎస్.సత్యనారాయణ, సర్పంచ్ స్వర్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.


జిల్లా యాదవ సంఘం కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన కైకలూరు నియోజకవర్గ సభ్యులు

యాదవ సంఘం జిల్లా కార్యవర్గంలో ముగ్గురికి చోటు

కైకలూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా యాదవ సంఘం జిల్లా కార్యవర్గం ఎంపికలో కైకలూరు నియోజకవర్గానికి చెందిన ముగ్గురికి పదవులు లభించాయి. శనివారం ఏలూరులో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గంలో జిల్లా ఉపాధ్యక్షుడిగా మండవల్లి మండలం చావలిపాడు గ్రామానికి చెందిన తలారి రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కలిదిండి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన కరేటి శ్రీహరి, జిల్లా సెక్రటరీగా ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు గ్రామానికి చెందిన బుసనబోయిన కిషోర్‌కు పదవులు వచ్చాయి. కైకలూరు నియోజకవర్గ శ్రీకృష్ణా యాదవ సంక్షేమ సంఘం నాయకులు బీకేఎం నాని, బోయిన రామకృష్ణ, గంగుల అశోక్, బోయిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యదర్శిగా దాసరి వెంకటస్వామి

నూజివీడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మున్సిపల్ కౌన్సిలర్ దాసరి వెంకటస్వామి జిల్లా యాదవ సంఘం కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఏలూరు పట్టణంలో జరిగిన యాదవ సంఘం సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నికను నిర్వహించగా, సంఘం జిల్లా కార్యదర్శిగా వెంకటస్వామిని ఎన్నుకున్నారు. నూజివీడుకు చెందిన పలువురు యాదవ ప్రముఖులు ఆయనను అభినందించారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయాలి

ముసునూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసేలా ఉపాధ్యాయులు ఉత్తమ బోధనలను అందించాలని మండల పరిశీలకులు, డైట్ కాలేజీ ఇంగ్లీష్ లెక్చరర్ ఎన్.జోజిబాబు అన్నారు. శనివారం ముసునూరులో జరిగిన క్లస్టర్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎంఈవో-2 బి.వి.యస్ సుబ్బారావు, క్లస్టర్ చైర్మన్ అల్లా భక్షు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

యువ భారత్ స్పోర్ట్స్ మీట్

ముదినేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మేరా యువభారత్ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ముదినేపల్లి వికాస్ జూనియర్ కళాశాలలో మండవల్లి బ్లాక్ స్థాయి స్పోర్ట్స్ మీట్ జరిగింది. జిల్లా శాఖ టీం సభ్యులు కె ప్రసన్న దత్త, కె జగదీష్ పర్యవేక్షణలో ఈ స్పోర్ట్స్ మీట్‌ను ముదినేపల్లి బీజేపీ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ తదితర ఆటల్లో కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పీఈటీ జి శివకోటయ్య ఆటల పోటీలను నిర్వహించగా కళాశాల చైర్మన్ జి మదన్‌కిషోర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్, హైస్కూలు ప్రిన్సిపాల్ సుబ్బారావు పాల్గొన్నారు.

త్రివిధ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు టౌన్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి):సబ్‌జోన్ వాలీబాల్ టీమ్‌కు నూజివీడు త్రివిధ విద్యార్థులు ఎన్నికైనట్లు ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. అండర్-14 విభాగంలో జె.నాగహృదిక్, ఎ.మోక్షజ్ఞ, అండర్ -17 విభాగంలో సిహెచ్ రాహుల్, అండర్ -17 బాలికల విభాగంలో టి.లాస్య ఎన్నికైనట్లు తెలిపారు. ఎన్నికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయుల బృందం అభినందించింది.

నిరుపయోగం!

(7వ పేజీ తరువాయి)

నివాసంగా మారాయి. తుప్పలు పెరిగి సీసీ రోడ్లను కమ్మేశాయి. నార్లవరం పంచాయతీ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయం, ఆర్‌ఎస్‌కే భవనాలు నిర్మించింది. వీటిని గతంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారం భించారు. ప్రస్తుతం ఇవి అలంకార ప్రాయంగా మారాయి. మండ లంలో రాచన్నగూడెం, పాకలగూడెం, ములగలంపల్లి ప్రాంతాల్లో నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఇళ్ల పరిస్థితి ఇలానే ఉంది. ప్రస్తుతం వీటి ఆలనా పాలనా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

తల్లిదండ్రులపై కొడుకు, కోడలు దాడి

ముసునూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొర్లకుంటకు చెందిన పిన్నిబోయిన వెంకటేశ్వరరావు, ధనలక్ష్మిపై ఈ నెల 14న వారి కుమారుడు వెంకట రామయ్య, కోడలు వీరమ్మ దాడి చేశారు. బాధితులు నూజివీడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

అదనపు కట్నం కోసం అత్తపై దాడి

కలిదిండి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కలిదిండికి చెందిన బుసన బోయిన రామలక్ష్మిని ఆమె అల్లుడు గంగుల సోమేశ్వరరావు అదనపు కట్నంగా ఇంటి స్థలం ఇవ్వాలని గొడవపడి అత్త రామలక్ష్మిపై కర్రతో దాడి చేయగా ఆమెను కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.


దుకాణాలను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న తదితరులు

బాణాసంచా దుకాణాల తనిఖీ

నూజివీడు, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి):నూజివీడు పట్టణంలోని లారీ అసోసియేషన్ ప్రాంగణంలో దీపావళి బాణాసంచా దుకాణాల సముదాయ ప్రాంతాన్ని నూజివీడు సబ్‌కలెక్టర్ వి.వినూత్న నేతృత్వంలోని జాయింట్ యాక్షన్ కమిటీ బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు నివారణకు చేపట్టిన భద్రతా చర్యలు బాణాసంచా దుకాణాల అనుమతులు, అగ్నిప్రమాద నివారణకు సంబంధించిన పరికరాలు పనిచేస్తున్నాయా? లేదా? తదితర అంశాలను బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత దుకాణదారులపై కఠినచర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణాలకు ప్రోత్సాహకాలు

ముసునూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ లబ్ధిదారులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ దాసరి ప్రశాంతి, ఎంపీడీవో పిల్లి ఏసుబాబులు అన్నారు. హౌసింగ్ డే సందర్భంగా లోపూడి గ్రామ సచివాలయంలో గృహనిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న నగదు ప్రోత్సాహకాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ దివాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో భాగంగా ఇళ్ళు కట్టుకుంటున్న ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా నగదును ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇళ్ళ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఏఈ దివాకర్ కోరారు. సర్పంచ్ పి.కృష్ణ, వైస్ ఎంపీపీ కె.రాజా, ఏపీవో రోజ్‌లీల, ఏపీఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

ఆగిరిపల్లి, అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖ ఏడీ2 ఎం. వెంకటప్పయ్య శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఎఫ్ఏ2 పరీక్షల ద్వారా గమనించి రెమిడీయల్ టీచింగ్ ఇవ్వాలన్నారు. ఎంఈవో-2 కొవ్వలి ఆనంద్‌కుమార్, హెచ్‌ఎం పి పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంచిన మెనూ చార్జీలు చెల్లించాలి

ముసునూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్రం పెంచిన మెనూ చార్జీలను వెంటనే చెల్లించాలని ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. శనివారం మిడ్డేమిల్స్ వర్కర్స్‌తో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు.



